నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 10 ఫిబ్రవరి 2024 | NIZAMABAD

## రేపు గురుకుల ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి/కామారెడ్డి, ఫిబ్రవరి 9 : టీఎస్‌డబ్ల్యూఆర్, టీటీడబ్ల్యూఆర్, టీఆర్‌ఈఐ, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయాధికారిణి సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు https://tgcet.cgg.gov.in సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వారికి కేటాయించిన కేంద్రాలకు 11వ తేదీన ఉదయం 10 గంటల లోపు చేరుకోవాలని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 17 సెంటర్లను ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్, ప్యాడ్, హాల్ టికెట్‌ను తప్పకుండా వెంట తీసుకురావాలని సూచించారు.

**కామారెడ్డి జిల్లాలలో ఏర్పాట్లు పూర్తి..**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాటు పూర్తిచేసినట్లుకామారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 3,986 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే సెంటర్లకు చేరుకోవాలని ఆయన సూచించారు.

## ముగిసిన అవిశ్వాస సమావేశం




అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన పీఏసీఎస్ డైరెక్టర్లు

సిరికొండ, ఫిబ్రవరి 9 : సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మైలారం గంగారెడ్డి, వైస్‌చైర్మన్ అయిత ప్రకాశ్‌పై డైరెక్టర్ల తీర్మానం మేరకు శుక్రవారం అవిశ్వాస సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే మధ్యాహ్నం ఒంటి గంటకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు రావడంతో.. ఫలితాన్ని వెల్లడించలేదు. 11 మంది డైరెక్టర్లు హాజరై, చైర్మన్‌కు వ్యతిరేకంగా 9 మంది, వైస్‌చైర్మన్‌కు వ్యతిరేకంగా పది మంది చేతులెత్తి అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించినట్లు సమాచారం. ఈ సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్ గైర్హాజరయ్యారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 15 వరకు ఫలితాలను ప్రకటించవద్దని డీసీవో శ్రీనివాసరావు ఆదేశించారు. సమావేశంలో ఆడిట్ టీం సభ్యులు ఆనంద్, పాపయ్య, రవీందర్, డైరెక్టర్లు పాల్గొన్నారు. అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకోవడం సిగ్గిచేటని డైరెక్టర్లు ఆరోపించారు.

# భారతరత్న మన పీవీ

- ప్రధానిగా తొలి పర్యటన ఎస్సారెస్పీ వద్దే
- వరద కాలువకు శంకుస్థాపన చేసింది ఆయనే
- కామారెడ్డిలో పీవీ పేరిట డెయిరీ కళాశాల






కామారెడ్డి జిల్లా కేంద్రంలో పీవీ పేరిట ఏర్పాటుచేసిన డెయిరీ కళాశాల

నిజామాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాములపర్తి వెంకట నరసింహారావు సంక్షిప్తంగా పీవీ నరసింహారావుగా భారతీయులందరికీ సుపరిచితమైన భరత మాత ముద్దుబిడ్డ, తెలంగాణ వాసి. చిన్నస్థాయి నుంచి అత్యున్నతమైన పీఠాన్ని అధిరోహించి ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ ప్రాంతాన్ని యావత్ దేశానికి పరిచయం చేసిన ఘనుడు. కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయి నుంచి దేశ ప్రధానిగా సేవలు అందించిన పీవీ.. భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరొందారు. ముప్పై ఏండ్ల కిందట సరళీకరణ విధానాన్ని ప్రవేశ పెట్టడంతో భారతదేశ స్థితిని, గతిని ఖండాంతరాలకు వ్యాపింపజేశారు. ఆ మహానుభావుడికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారతరత్నను ప్రకటించింది. మరణానంతరం సరిగ్గా 20 ఏండ్ల తర్వాత ఈ పురస్కారం మన తెలుగు ఠీవీ.. పీవీకి దక్కడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు భారతరత్న అవార్డు కోసం కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడంతోపాటు పీవీ సేవలను స్మరించుకున్నది. ఈ నేపథ్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నర్సింహారావుతో ఉమ్మడి జిల్లాకు ఉన్న అనుబంధంపై ప్రత్యేక కథనం.

**వరద కాలువకు శంకుస్థాపన...**

చారిత్రక శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వృథాగా పోతున్న గోదావరి జలాలను ఒడిసి పట్టేందుకు ప్రధానమంత్రి హోదాలో పీవీ నర్సింహారావు అద్భుతమైన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1993, జూన్ 30న పీవీ నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి ప్రస్తుతం మండలంగా రూపాంతరం చెందిన ముప్కాల్ సమీపంలోనే వరద కాలువకు శంకుస్థాపన చేశారు. గోదావరి వరద నీటిని ప్రత్యేక కాలువ ద్వారా దిగువకు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో పంటల సాగుకోసం అందించే లక్ష్యంతో ఈ ప్రయత్నానికి పూనుకున్నారు. అనంతరం కొంతకాలం కాంగ్రెస్, తెలుగుదేశం పాలించగా, ఆంధ్ర పాలకులు వరద కాలువ ఊసెత్తలేదు. తాత్సారం చేస్తూ దశాబ్దంన్నర కాలంలో పూర్తి వరద కాలువ ట్రయల్ రన్ నోచుకునే సమయానికి ఎగువన మహారాష్ట్ర నిర్మించిన అక్రమ ప్రాజెక్టులతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బోసిపోయే దుస్థితికి చేరింది. తద్వారా పీవీ ఆశయం నీరుగారే పరిస్థితికి చేరింది. దీంతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా పీవీ శంకుస్థాపన చేసిన వరద కాలువకు కేసీఆర్ ప్రాణం పోశారు. కేసీఆర్ సర్కారు జల సంకల్పంతో దివంగత ప్రధాని పీవీ నర్సింహారావుకు ఘనమైన నివాళి అర్పించారు.

**ప్రధానిగా తొలి పర్యటన...**

1983 నుంచి శ్రీరాంసాగర్‌కు వరదలు ప్రారంభమయ్యాయి. భారీగా వరదలు వచ్చిన ప్రతిసారీ మిగులు జలాలను ప్రాజెక్టుగేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలేసేవారు. ఇలా వృథాగా పోతున్న జలాలను ప్రాజెక్టు దిగువన వినియోగించుకోవాలనే లక్ష్యంతో వరద కాలువ నిర్మించాలని ఆలోచించారు. అప్పుడే ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని లక్షల మెట్ట భూములకు సాగునీటిని అందిచే లక్ష్యంతో వరద కాలువ నిర్మాణానికి బీజం పడింది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలకేంద్రం సమీపంలోనే ఎస్సారెస్పీ జీరో పాయిట్ వద్ద ఇప్పుడు వరద కాలువ గేట్లు ఉన్న చోటనే ప్రధాని హోదాలో పీవీ వరద కాలువకు శంకుస్థాపన చేశారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిజామాబాద్ జిల్లాలో పీవీకి ఇదే తొలి పర్యటన కూడా. 1070 అడుగుల నీటి మట్టం వద్ద వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఆరు గేట్లతో నిర్మించారు. 22 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. 1074 అడుగుల నీటిమట్టం వరకు ప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేసుకునేలా, 122 కి.మీ. పొడవుతో కాలువను నిర్మించారు. ఇప్పుడిది మాజీ ప్రధాని ఇందిర పేరిట మనుగడలో ఉన్నది. పీవీ పేరును వరద కాలువకు పెడితే బాగుంటుందని చాలా మంది తెలంగాణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**పీవీ పేరిట కామారెడ్డిలో డెయిరీ కళాశాల..**

2008లో ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కొనసాగుతున్నప్పుడు ఉమ్మడి జిల్లా పరిధిలోని కామారెడ్డి శివారులో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం – తిరుపతి అనుబంధంగా క్షీర సాంకేతిక కళాశాలను మంజూరు చేశారు. దీనికి 2008 మార్చి ఒకటిన వైస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ మంత్రిగా ఉన్నప్పటికీ 2014 వరకూ ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. డెయిరీ టెక్నాలజీ కళాశాల భవనాన్ని నాటి వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పూర్తి చేయించారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత పీవీ స్మారకార్థం ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర పశు వైద్య, మత్స్య శాస్త్ర విశ్వవిద్యాలయానికి కేసీఆర్ ప్రభుత్వం చొరవ తీసుకొని పీవీ నర్సింహారావు పేరు పెట్టగా, యూనివర్సిటీ అనుబంధ కళాశాల ఆయన పేరిటే కొనసాగుతున్నది. ఈ విశ్వవిద్యాలయాన్ని 60 ఎకరాల కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల్లో ఏర్పాటుచేశారు. డెయిరీ టెక్నాలజీలో ప్రస్తుతం ఐదు రకాల కోర్సులు నిర్వహిస్తున్నారు. నాలుగు సంవత్సరాల బీటెక్‌లో భాగంగా డెయిరీ టెక్నాలజీ కోర్సును పీవీ నరసింహారావు పశు వైద్య, మత్స్య శాస్త్ర విశ్వవిద్యాలయం అందిస్తున్నది.






## డిమాండ్‌కు అనుగుణంగా ఎర్రజొన్న ధర

### క్వింటాలుకు రూ.3500కు తగ్గకుండా చెల్లిస్తామని ట్రేడర్ల హామీ



ట్రేడర్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ కలెక్టర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 9 : ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ పంటను సేకరించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఎర్రజొన్న దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారులు, విత్తన వ్యాపారులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోళ్లు జరగాలని, రైతులు ఒకవేళ బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎర్రజొన్న సాగు విస్తీర్ణం, పంట దిగుబడులు, ధరలు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పంట రకాన్ని బట్టి క్వింటాలుకు రూ.3500 నుంచి రూ.4300 వరకు ధర లభిస్తుండగా.. తాము రైతులతో అదే విధంగా బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నామని వివరించారు. పంట కోతలు ప్రారంభమయ్యాయని, పక్షం రోజుల తర్వాత పెద్ద ఎత్తున దిగుబడులు చేతికందుతాయని తెలిపారు. సీజన్ చివరి దశ వరకు కూడా క్వింటాలుకు కనీస మద్దతు ధరగా రూ.3500 వరకు చెల్లిస్తామని ట్రేడర్లు స్పష్టమైన హామీనిచ్చారు. రైతులు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను మోసగించే చర్యలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఏడీఏలు, ఏవోలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు కామారెడ్డి జడ్పీ సమావేశం

కామారెడ్డి, ఫిబ్రవరి 9 : కామారెడ్డి జడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నేడు (శనివారం) ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈవో సాయాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం కింద కేటాయించిన నిధులతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించి, ఆమోదించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

### 29 ద్విచక్రవాహనాలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, ఫిబ్రవరి 9 : ఉమ్మడి జిల్లాలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ముగ్గురిని కామారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 29 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధూశర్మ నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఓ బైక్‌పై వచ్చిన నిజాంపూర్ శశాంక్, యెరుగట్ల సందీప్, షేక్ అహ్మద్‌ను ఆపి వాహన ధ్రువపత్రాలను చూపించమనడంతో పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే వారిని పోలీసులు పట్టుకొని విచారణ చేపట్టగా ముగ్గురు కలిసి ఉమ్మడి జిల్లాతోపాటు నిర్మల్ ప్రాంతంలో మొత్తం 29 ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వీటి విలువ రూ. 40 లక్షల వరకు ఉంటుందని ఎస్పీ తెలిపారు. బైక్ దొంగలను పట్టుకున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు.

















